క్లుప్తంగా

భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో శ్రీభీమేశ్వర శ్రీవీరభద్రేశ్వర స్వామి వార్ల బింబియంత్ర శిఖర ధ్వజ పునఃప్రతిష్టమహోత్సవంలో భాగంగా ఆలయ ఆవరణలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యబలిహారణ, ధాన్యాధివాసం, అధివాసాం గహోమం, హారతి నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హోమంలో పాల్గొన్నారు.

223 మందికి వైద్య పరీక్షలు



అచ్చంపేట: ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాదిపాడులో శుక్రవారం 223 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. ముఖ్యంగా జ్వరపీడుతులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా చూచుకోవాలని, స్వచ్ఛమైన నీటిని కాచిచల్లార్చి తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. ఆయన వెంట ఏఎన్ఎంలు, ఆశవర్కర్స్ పాల్గొన్నారు.

25 శాతం ఉచిత సీట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఎంఈఓ రాజశేఖర్

అచ్చంపేట: ప్రైవేట్ పాఠశాలలో ఉచిత సీట్ల కోసం ఈనెల 15లోపు ఆన్‌లైన్‌లో దరస్తు చేసుకోవాలని ఎంఈఓ వి.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాహక్కు చట్టము 2009, సెక్షన్(12)(1)సి ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను నిరుపేదకుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీని ప్రకారం తల్లి దండ్రులు తమ పిల్లలను 1వ తరగతి నుంచి ప్రైవేటు పాఠశాలలో చేర్చదల్చుకుంటే ఆన్‌లైన్‌లో ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరికైనా ఆన్‌లైన్ చేసుకోవడం సాధ్య పడకపోయినా, తెలియకపోయినా స్థానిక విద్యావనరుల కార్యాలయంలో ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆయన కోరారు.

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

క్రోసూరు: రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగపరుచుకోవాలని ఏఓ వేణుగోపాల్ కోరారు. శుక్రవారం మండలంలోని క్రోసూరు, 88త్యాళ్లూరు గ్రామాల్లోని రైతుభరోసాకేంద్రాల వద్ద రైతు సదస్సులు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఏఓ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవిలో రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విత్తనాలను లైసెన్సు గల డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని రైతులకు చెప్పారు. వాటికి బిల్లులు కూడా తప్పని సరిగా తీసుకోవాలన్నారు. పీఎంకేవై సంబంధించి ప్రతి సాగు చేసే రైతు ఈకేవైసీ పూర్తిచేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సేద్యంతో భూమికి జీవవైవిద్యం

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి



బెల్లంకొండ: నవధాన్యాల పంటలను సేద్యం చేయడం వల్ల భూమికి జీవవైవిద్యం పెరిగి ప్రధాన పంటకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు అందుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సమిశిత అభివృద్ధి పథకం, వ్యవసాయ మరియు అనుబంధ సంస్థల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంట దిగుబడుల పెంచేందుకు, నేలలో సూక్ష్మ జీవులు వృద్ధి చెందడానికి, పోషకాలు తగిన మోతాదులో పెరగడానికి, భూమి వేసవి తాపాన్ని తట్టుకుని ఏడాది అంతా పైరును పెంచేందుకు నవధాన్య సాగు విధానమే ఉత్తమమన్నారు. నవధాన్య పంటలుగా పచ్చిరొట్ట, పప్పుజాతి, నూనె జాతి, సుగంధ జాతి, ధాన్యపు జాతి, తీగ జాతి, పూల జాతి రకాలను ఎంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సేద్యంపై కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు, ఏవో కృష్ణయ్య, సీసీ మల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

జీవాల పెంపకందార్లను ప్రభుత్వం ఆదుకుంటుంది

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మృత్యువాత పడిన జీవాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బాలెమర్రు(క్రోసూరు): ఈదురుగాలలకు 11కేవీ విద్యుత్ తీగ తెగిపడి మృత్యువాతపడిన జీవాల పెంపకదార్లను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మండలంలోని బాలమర్రు గ్రామంలో పొలాల్లో గురువారం సాయంత్రం విద్యుదాఘాతనికి గురై మృత్యువాత పడిన 54 జీవాలను సందర్శించారు. బాధిత జీవాల పెంపకందార్లు పాటిబండ్ల నాగేశ్వరరావు-(చనిపోయినవి 23 గొర్రెలు,) మేకల రవి-(19 గొర్రెలు), మండపల్లి సురేష్ -(11 గొర్రెలు), ఎర్రగొండ్ల సుబ్బారావు -(1 మేక)లను పరామర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన జీవాల పెంపంకం దార్లను తప్పక ఆదుకుంటుందన్నారు. భవిషత్తులో ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుండా విద్యుత్ అధికారులు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఘటనా ప్రదేశంలో పోలీసు, పశుసంవర్ధకశాఖ, రెవెన్యూ, విద్యుత్ అధికారులను పిలిపించుకుని విచారించారు. ఇన్‌చార్జి ఎస్ఐ షేక్ మహబూబ్‌సుభాని కేసు నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవాల పెంపకందార్లు జీవాలకు బీమా చేయించుకోవడం ఎంతో ప్రయోజనమని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు నష్టం తగ్గుతుందన్నారు. ప్రమాదాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తానని ఈసందర్భంగా హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట విప్పర్ల వైఎస్సార్ సీపీ నాయకులు నర్రావాసు, ,ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగపూర్, గార్లపాటిదాసు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, మేదరరోశయ్య, వేజండ్లరవి, అనుముల కోటిరెడ్డి, డాక్టర్‌షరీఫ్, బాలెమర్రు నుంచి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బొల్లవరంలో గ్రామోదయం



బొల్లవరంలో గ్రామోదయంలో భాగంగా వైద్యసేవలను పరిశీలిస్తున్న తహసీల్దార్

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీని పరిశీలించారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్‌మేనేజ్ మెంట్ కేంద్రంలో ఎరువుల తయారీని పరిశీలించి విధులు నిర్వహిస్తున్న క్లాప్‌మిత్రలను సన్మానించారు. వారితో కలిసి అల్పాహారం చేశారు. ఆరోగ్య ఉపకేంద్రంలో జరుగుతున్న వైద్యశిబిరాన్ని పరిశీలించారు. గ్రామస్తులకు అందుతున్న వైద్యసేవలపైన గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ ఒంగోలురాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పీటర్‌డానియేన్, స్థానికులు బద్దిగంవెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చీమలమర్రిలో గ్రామోదయం

నకరికల్లు : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని సకాలంలో పరిష్కరించేందుకు గ్రామోదయం కార్యక్రమం దోహదపడుతుందని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.బాలూనాయక్ అన్నారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో ట్రాన్సిట్ వాక్, గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అధికారుల బృందం గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. క్లాప్‌మిత్రలతో కలిసి అల్పాహారం చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు స్వయంగా వీధుల్లోని పిచ్చిమొక్కలు తొలగించారు. జగనన్న కాలనీని సందర్శించి చేపడుతున్న పనులను ఆరాతీశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్దిపొందిన వారితో మాట్లాడి పథకం పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు చేర్చడం, ప్రజాసమస్యలు పరిష్కచడం ప్రధానధ్యేయంగా పర్యటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఎస్.సురేష్, ఈఓపీఆర్డీ గిరిధర్, గ్రామకార్యదర్శి ఎం.శైలేంద్రకుమార్, ఆయాశాఖల సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



పెదకూరపాడు: ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు గృహనిర్మాణాలు వెంటనే చేపట్టాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్, పెదకూరపాడు మండల ప్రత్యేక అధికారి గుంటుపల్లి ధనలక్ష్మి కోరారు. మండలంలోని పెదకూరపాడు, 75 త్యాళ్లూరు గ్రామాల్లో జగనన్న కాలనీల్లోని గృహనిర్మాణాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. నిర్మాణాలను చేపట్టని బుడగజంగాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం అందిస్తున్న ఇసుక, సిమెంట్, ఇనుము, ఇతర సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలో మొత్తం 28 లే-అవుట్‌లు ఉండగా, బీపీఎల్ స్థాయిలో 344, ఆర్‌ఎల్ 39, ఆర్సీలు 17, పూర్తయిన గృహాలు 99 ఉన్నాయన్నారు. 47 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించారు. లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ నరసింహారావు, హౌసింగ్ ఏఈ పాషా, గృహనిర్మాణ శాఖ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదకూరపాడు: పెదకూరపాడు సబ్ స్టేషన్, 75 త్యాళ్లూరు సబ్‌స్టేషన్‌ల పరిధిలో రెండో శనివారం నేపథ్యంలో లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్తెనపల్లి: పట్టణంలో 11 కెవి లైన్‌లో చెట్ల కొమ్మల నరికివేత, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సత్తెనపల్లి టౌన్‌లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పీ.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు. ఏదైనా విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు : 9494116238 కు ఫోన్ చేయాలన్నారు.

అమరావతి: నేడు రెండవ శనివారం కావడం చేత అమరావతి, ఉంగుటూరు, మల్లాది సబ్ స్టేషన్‌ల్లో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అమరావతి మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముప్పాళ్ళ: మండలంలోని 220 కే.వీ.విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులకారణంగా ఈ నెల13వ తేదీ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ రవికిరణ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్స్ మెయింటెన్స్ తో పాటుగా సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్టా సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



సత్కారం అందుకున్న నర్సులు, వైద్యులతో కొత్త రామకృష్ణ, సూపరిండెంట్ డాక్టర్ వెంకట్రావు

సత్తెనపల్లి: పేగు బంధం లేకపోయినా ఆపదలో ఉన్న వారికి వైద్యసేవలందించే త్యాగమూర్తులు నర్సులు అని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో శుక్రవారం వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి నర్సులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ కరోనా ప్రబలి జనం భయాందోళనకు గురైన సమయంలో వైద్యులతో పాటు వారికి గుండె ధైర్యం చెప్పిన వారు నర్సులన్నారు. వైద్యుల చికిత్స అనంతరం రోగుల ఆలనా పాలనా చూసేది వారేనన్నారు. నర్సులందరు ఎంతో అంకితభావంతో, సేవా భావంతో పని చేసి తమ వృత్తికి గర్వ కారణం కావాలన్నారు. పల్లెటూరు నుంచి వచ్చే రోగులను సైతం సొంత మనుషుల్లాగా చూడాలని కోరారు. వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు మాట్లాడుతూ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం వైద్యశాలలో జరుపుకోవడం అది అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇంత ఘనంగా జరగడం గొప్ప విషయం అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాల వైద్యులు డాక్టర్ సుష్మ, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ సరస్వతి, డాక్టర్ ప్రవీణ్, మెడికల్ సూపరిండెంట్ విజయలక్ష్మి, ఓ భవాని, హెడ్ నర్స్‌లు రమణమ్మ, మరియమ్మ, నర్సింగ్ సూపరిండెంట్ రాధ, నర్సులు, తదితరులు ఉన్నారు.

సాంఘిక బహిష్కరణ బాధితుల రాస్తారోకో



సత్తెనపల్లి: మండలంలోని పెదమక్కెన గ్రామంలో సాంఘిక బహిష్కరణ జరిగి 20 సంవత్స రాలై సంఘటన కోర్టులో రుజువై నిందితులకు శిక్షలు పడ్డ, జీఓ నంబర్ 95 ప్రకారం నష్ట పరిహారాలు అమలు చేయకుండా గత ఐదు రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోక పోవడాన్ని నిరశిస్తూ శుక్రవారం బాధితులు పెదమక్కెనలో రాస్తారోకో చేపట్టారు. నిరాహార దీక్షలు చేస్తున్నా కనీసం తహసీల్దార్ ద్వారా వచ్చి వివరాలు తెలుసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న విధానం సరైంది కాదన్నారు. సాంఘిక బహిష్కరణ బాధితులు, మాల, మాదిగ కులస్తులు పెదమక్కెనలో రోడ్లకు అడ్డంగా కూర్చుని పోస్టర్లు పట్టుకుని నినాదాలు చేయడంతో వాహనాలు నిలిచి పోయి ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఇది తెలుసుకున్న సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో సంప్రదింపులు చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించకుండా శాంతియూత వాతావరణంలో తమ ఆవేదనను అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళాలని సూచించారు. సాంఘీక బహిష్కరణకు గురైన బాధితులు తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని జిల్లా కలెక్టర్ అమలు చేయాలన్నారు. డీఆర్‌ఓ వినాయకంను జిల్లా నుంచి బదిలీ చేయాలని, దీక్ష శిబిరాన్ని సందర్శించి బాధితులు గోడు పట్టించుకోవాలని ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజ్జం శేఖర్ డిమాండ్‌చేశారు. ఈ నెల 15న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల కోరారు. కార్యక్రమంలో సాంఘీక బహిష్కరణకు గురైన బాధితులు, ఇద్వా కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజుపాలెం: ఎస్సీ, ఎస్టీ రైతులు ఉపాధి హామీ పథకం నుంచి వచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో దళిత బహుజన రిసోర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏపీఓ మాట్లాడుతూ హార్టికల్చర్‌కు సంబందించిన జామా, మామిడి, మునగ మొదలైన పంటలు వేసుకున్నట్‌లైతే ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ వస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని కోరారు. ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి సబ్సిడీపై ఇచ్చే పచ్చిరొట్టి విత్తనాలను తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు వెళ్లాలని సూచించారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

బెల్లంకొండ: పర్యావరణాన్ని కాపాడాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించడమే మార్గమని అటవీ శాఖ పాపాయపాలెం సెక్షన్ డీఆర్వో రమణయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో పర్యావరణం పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడానికి సాధ్యమయ్యే మార్గాలపై గ్రామస్తులకు అవగహన కల్పించారు. అనంతరం గ్రామంలో పలు చోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామస్తులతో కలిసి తొలగించారు. ప్రధాన సెంటర్‌లో పర్యావరణహిత జీవన విధానం గురించి వివరించారు. నీటిని పొదుపుగా వినియోగించాలని, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తీసుకోవడం, ఆరోగ్యకర అలవాట్లు వంటి వాటిపై అవగహన కల్పించారు. గ్రామస్తులతో అటవీ శాఖ సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. గ్రామసర్పంచ్ దేసు మల్లీశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు చిట్టిశెట్టి శివనాగమణి, దేసు బ్రహ్మం, భద్రయ్య, రామకోటినాయక్, బీట్ ఆఫీసర్లు వెంకట్రావు, రాకేష్, సాంబయ్య పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్ట లేనివి



పీహెచ్‌సిలో నర్సులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, సిబ్బంది

అమరావతి: కరోనా కష్టకాలంలో ప్రజలకు నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అందించిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర ఎంపీపీల సంఘ కన్వీనర్ అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా అమరావతి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వైద్యరంగంలో ఆదర్శవ్యక్తి ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఫ్లోరెన్స్‌నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేకల హనుమంతరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధికప్రాధాన్యతనిచ్చి ఆస్పత్రులను కూడా నాడు-నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేస్తున్నారన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దారు పద్మాదేవి



చింతపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న మండలస్థాయి అధికారులు

అచ్చంపేట: ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, జీవితాలను మెరుగు పరచుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తహసీల్దారు పద్మాదేవి సూచించారు. గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చింతలపల్లిలో మండల స్థాయి అధికారులు పర్యటించారు. అన్ని వీధుల్లో తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఇంటి పరిసరాల్లో చెత్త పేరుకు పోకుండా చూచుకోవాలని, దోమల తీవ్రత ఎక్కువై వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఎన్నో మేలైన సౌకర్యాలు ఉన్నాయని, పుస్తకాలు, బ్యాగులు, షూస్ ఇస్తారని, పిల్లలను బడికి పంపి బాగా చదివించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వరూపారాణి, పంచాయతీరాజ్ ఏఈ శేషప్పయ్య, ఆర్‌డబ్లియస్, పీహెచ్‌సి, అగ్రికల్చర్‌లు శాఖల అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఖరీఫ్‌సాగుకు సమాయత్తం కావాలి

ఏఓ సుగుణాబేగం



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుగుణాబేగం

అచ్చంపేట: రైతులంతా ఖరీఫ్ సాగుకు భూములను సిద్ధంగా ఉంచుకోవాలని, వేసవి దుక్కులు దున్నుకోవాలని వ్యవసాయాధికారి షేక్ సుగుణాబేగం తెలిపారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తం కర్యక్రమంలో భాగంగా మండలంలోని పెదపాలెం, కొండూరు గ్రామాల్లో శుక్రవారం జరిగిన రైతు అవగాహన సదస్సులో ఆమె రైతులనుద్దేశించి మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణమైన ఎరువులు వాడవలసి ఉంటుందని చెప్పారు. లైసెన్సులు ఉన్న డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు బిల్లు తీసుకుని పంటకాలం పూర్తయ్యేంత వరకు భద్రపరచుకోవాలని చెప్పారు. కౌలు రైతులంతా పంట సాగు హక్కు పత్రాలను పొందితేనే బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు తీసుకునేందుకు సాధ్యపడుతుందని చెప్పారు. తొలకరి వర్షాలకు పచ్చిరొట్టి ఎరువులను భూముల్లో వేసికుని, అవి పెరగగానే రోటోవేటర్ ద్వారా భూమిలో కలయదున్నుకోవాలని చెప్పారు. రైతులు వేసే పంటను ఈ క్రాపింగ్ చేయించుకోవలసి ఉంటుందన్నారు. యంత్ర సేవా పథకం, డ్రోన్స్ వినియోగం గురించి వివరించారు. పసువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి మాట్లాడుతూ పశువుల్లో తరచు వచ్చే వ్యాధులు, వాటి నిర్మూలన గురించి వివరించారు. వ్యాక్సినేషన్, డి వార్మింగ్ తదితర విషయాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది తనిఖీలు



మాట్లాడుతున్న డీఈఈ శ్రీనివాసరావు, తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

క్రోసూరు: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ విస్తృత తనిఖీలు శుక్రవారం చేపట్టినట్లు మండల విద్యుత్ ఏఈ ఎం.బసవరాజు తెలిపారు. తనిఖీల్లో పాల్గొన్న నరసారావుపేట డివిజన్ విద్యుత్‌శాఖ డీఈఈ ఎస్ శ్రీనివాసరావు వివరిస్తూ మండలంలో మొత్తం 11 గ్రామాల్లో 30 బృందాలుగా 1306 సర్వీసులు తనిఖీ చేసినట్లు తెలిపారు. వీటిలో భాగంగా కాటగిరీ -1 సర్వీసులు 1252 తనిఖీ చేసినట్లు తెలిపారు. వీటిలో 94 సర్వీసుదారులు అదనపులోడులు వినియోగిస్తున్నందుకు రూ.3,39,000 పెనాల్టీ విధించినట్లు తెలిపారు. కాటగిరీ -2 సర్వీసులు 54 తనిఖీలు చేయగా 12 సర్వీసులు రూ.39,000 అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. విద్యుత్ చోరీకి పాల్పడుతున్న ఐదు సర్వీసుదారులకు రూ.42వేలు విధించినట్లు తెలిపారు. మీటరు లేకుండా విద్యుత్ వాడుకుంటున్నందుకు 11 సర్వీసుదారులకు రూ.22 వేలు పెనాల్టీ విధించడం జరిగిందన్నారు. గృహం పేరుతో విద్యుత్ 12 సర్వీసు దారుసు తీసుకుని వ్యాపారానికి రూ.39వేలు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ విద్యుత్ చోరీకి పాల్పడడం చట్టరీత్యానేరమని తెలిపారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని, విద్యుత్ సమస్యలు ఉన్నట్‌లైతే మీదగ్గర ఉన్న సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. ఈ దాడుల్లో డీఈఈ తోపాటుగా డివిజన్ ఏడీఈ టి.శ్రీనివాసరావు, తోపాటు నలుగురు ఏడీఈలు, ఏఈలు సత్తెనపల్లిటౌన్, నూజెండ్ల, నకరేకల్లు,రొంపిచర్ల, రెమిడిచర్ల, అచ్చంపేట, సత్తెనపల్లిరూరల్, వినుకొండ, బండ్లమోటు, ఈపూరు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పంటతో సూక్ష్మపోషకాల లభ్యత

నకరికల్లు: పచ్చిరొట్ట పంటను 40-50 రోజుల వ్యవధిలో పూతదశలో కలియదున్నడం ద్వారా భూమిలో ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మపోషకాలు, సేంద్రీయ కర్బనం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో ఖరీఫ్ 2023కు గాను సాగుకు సమాయత్తం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసాకేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కౌలుదారుని హక్కుపత్రం ద్వారా కౌలురైతులకు పలు పథకాల లబ్ధిచేకూరుతుందని అన్నారు. జీవనఎరువులు, సిలీంధ్ర నాశనులు వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.శ్రీనివాసరావు, వీఆర్వో పి.చినబ్రహ్మయ్య, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తన దుకాణాల్లో విజిలెన్స్ దాడులు



ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సత్తెనపల్లి: పట్టణంలోని పలు ఎరువుల, విత్తన దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. గుంటూరు ప్రాంతీయ నిఘా, అమలు అధికారి భవాని శ్రీహర్ష ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుంటూరు యూనిట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. పట్టణంలోని భాలాంజనేయ ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్, శ్రీ వెంకట సాయి విత్తన విక్రయ షాపులు నందు తనిఖీలు నిర్వహించారు. శ్రీ బాలంజనేయ ఫెర్టిలైజర్స్ షాపు లోవిత్తనాలు అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు, రికార్డుల నిర్వహణ సరిగా లేదని గుర్తించి 35.625 కేజీల కాటన్ విత్తనాలు విలువ రూ. 69,750 గలవి స్వాధీన పరుచుకుని, 6-ఏ కేసు నమోదు చేశారు . వేంకట సాయి సీడ్స్ షాప్ నందు సోర్స్ సర్టిఫికేట్ లేనందున 10.725 కేజీల కాటన్, చిల్లీస్ విత్తనాలకు 'స్టాప్ సేల్' నోటీస్ ఇచ్చారు. రూ.87,913 విలువ గల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి, ఏఓ వాసంతి, సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్. శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాటు పూర్తి



కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు

బెల్లంకొండ: ఈ నెల 14 నుంచి బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. కబడ్డీ పోటీలకు కమిటీ సభ్యులు గత రెండు రోజుల నుంచి శ్రమించి ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో బాలురు, బాలికలు రెండు విభాగాల్లో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.